పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ పాలకుర్తి మధుసుధన్ రావు రచించిన నేను–నా ఆకాశ దర్శన్ పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ..ఆకాశవాణి, దూరదర్శన్ సంచాలకులుగా పనిచేసిన మధుసుధన్‌రావు తన అనుభవాలను అక్షరమాలిక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ పుస్తకం ఆకాశవాణి యువతరానికి ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు. అంతకు ముందు గాయని గాయకుల సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రముఖ రచయిత జి.వల్లీశ్వర్, పాత్రికేయులు ఆర్.జయదేవ, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో క్రిస్మస్ సందడి

- ముస్తాబవుతున్న చర్చిలు
- జోరుగా క్రిస్మస్ వస్తువుల అమ్మకాలు





నానల్‌నగర్ సెంట్రల్ బుక్ డిపోలో క్రిస్మస్ వస్తువుల అమ్మకాలు



ముస్తాబైన సాలర్‌జంగ్ కాలనీలోని సెయింట్ మైకేల్స్ చర్చి

గోల్కొండ: మార్కెట్‌లో క్రిస్మస్ సందడి నెలకొంది. స్టేషనరీ షాపులు, గిఫ్ట్ షాపులు క్రిస్మస్ కొనుగోళ్లతో సందడిగా మారాయి. కార్వాన్ నియోజకవర్గంలోని చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. టోలిచౌకీలోని సాలర్ జంగ్ కాలనీ సెయింట్ మైకేల్స్ చర్చి క్రిస్మస్ వేడుకలకు కొత్త అందాలు సంతరించుకుంది. క్రిస్మస్ పండుగ కోసం చర్చి ప్రార్థన మందిరంతో పాటు చర్చి ఆవరణను కూడా అందంగా ముస్తాబు చేశారు. అదే విధంగా టోలిచౌకీ నదీమ్ కాలనీలోని స్టార్ బైబిల్ చర్చిని కూడా క్రిస్మస్ కోసం ముస్తాబు చేశారు. మాసబ్‌ట్యాంక్ అహ్మద్‌నగర్‌లోని రాక్ చర్చిని కూడా అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మెహిదీపట్నం పరిసరాల్లోని అత్యంత పెద్దదైన రాక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి. వేడుకల కోసం ప్రార్థన మందిరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఫేర్వెల్స్ పాడడానికి ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. గుడిమల్కాపూర్, నానల్‌నగర్, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని చర్చిలు సైతం క్రిస్మస్ సంబరాలకు ముస్తాబయ్యాయి.

జోరందుకున్న అమ్మకాలు..

గత రెండు రోజుల నుంచి క్రిస్మస్ పండుగ నేపథ్యంలో స్టేషనరీ షాపులలో కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. క్రిస్మస్ గౌన్‌లు, క్రిస్మస్ ట్రీలు పెద్ద ఎత్తున అమ్ముడవుతున్నాయి. నానల్‌నగర్‌లోని సెంట్రల్ బుక్ డిపోలో ఆకర్షణీయమైన క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ తాత ధరించే గౌన్లు ప్రత్యేకంగా క్రైస్తవ సోదరులు కొంటున్నారు. అదే విధంగా ఇళ్లు, చర్చీలను అలంకరించడానికి స్టార్ గుర్తుతో గల తోరణాలు కూడా జోరుగా అమ్ముడవుతున్నాయి.

'ప్రార్థనలు ఆధ్యాత్మిక భావాలు పెంపొందిస్తాయి'



గోల్కొండ అష్రఫీ మసీద్‌లో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: ప్రార్థనలు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడమే కాకుండా మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండలోని అష్రఫీ మసీద్‌లో మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమయ్యారు. అత్యంత పురాతనమైన ఈ మసీదు నిర్వహణను సమర్థవంతంగా చేస్తున్న మజీద్ కమిటీ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజీద్ నిర్వహణ కమిటీ సభ్యుల మధ్య ఐక్యత ఉండాలన్నారు. ఐక్యత ఉన్నప్పుడే మసీదును సమర్థవంతంగా నిర్వహించగలుగుతామని మజీద్‌కు ప్రార్థనలకు వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ నిర్వహణ కమిటీ సభ్యులు సయ్యద్ ఆజామ్, మతీన్, మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ నాయకుడు ఆరూన్‌ఫరాన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

చాంద్రాయణగుట్ట: ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బస్తీల్లో శుక్రవారం ఆయన బస్తీ పెద్దలు, యువకులు, విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చాలా మంది విద్యార్థులు పాఠశాల దశ నుంచే గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసవుతుండడం బాధాకరమన్నారు. నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో డ్రగ్స్‌కు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

గన్‌ఫౌండ్రీ: హన్మకొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాతృసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. ఏటూరు నాగారానికి చెందిన విశ్వబ్రాహ్మణులు వేములవాడ దర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. మృతిచెందిన మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలాజీ ఆలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు



రఘునందన్ రావుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ అర్చకులు

చార్మినార్: వైకుంఠ ఏకాదశి నాడు స్వామి దర్శనం కోసం భక్తులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చార్మినార్ ఈస్ట్ చౌక్ మైదాన్‌లోని బాలాజీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వారం రోజుల ముందు నుంచే తగిన ఏర్పాట్లు చేశారు. ఈ ఆలయంలో 1961 నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈసారి జరిగే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు, అలంకార బ్రహ్మ శృంగారం ఆత్రేయాచార్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 23న ఉదయం ఆరున్నర గంటలకు స్వామి వారి పల్లకీ ఊరేగింపు సేవా తదితర కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు. ఈ సామూహిక పల్లకీ సేవా ఊరేగింపు చార్మినార్, గుల్జార్‌హౌజ్, కాలీకమాన్, పంజేషా, ఎతేబార్‌చౌక్, కోట్లా ఆలిజా ద్వారా తిరిగి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావుకు ఆలయ అర్చకులు శృంగారం ఆత్రేయాచార్యులు ఆహ్వాన పత్రం అందజేస్తారు.

తెలంగాణ వక్ఫ్ ఆస్తులను కాపాడాలి



చార్మినార్: తెలంగాణ రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను కాపాడాల్సిన అవసరం ఉందనే విషయాన్ని కేంద్ర మైనార్టీ మంత్రిత్వ శాఖ మంత్రి ఇక్బాల్ సింగ్‌ను కోరినట్లు పాతబస్తీ దారుషిఫాకు చెందిన బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. మంత్రి ఇక్బాల్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట్రంలోని మైనార్టీ ప్రజల సంక్షేమంతో పాటు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. తన ఫిర్యాదుల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

ఘనంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం



గణితంపై సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మ్యాథమెటిక్స్ అండ్ హ్యుమ్యానిటీస్ వారు వేద గణిత శాస్త్రం ప్రాముఖ్యతపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో సీబీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ.. శ్రీనివాస రామానుజం ప్రతిభవల్లే నేడు గణిత శాస్త్రం విలువ ప్రపంచానికి తెలిసిందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌రెడ్డి, హెచ్ఓడీ డాక్టర్ ఎం.మాధవిలత, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.అపర్ణ తదితరులున్నారు.



మెహిదీపట్నం శ్రీచైతన్య స్కూల్‌లో...

మెహిదీపట్నంలో..

శ్రీనివాస రామానుజం ప్రపంచానికి గణిత శాస్త్రంలో దిక్సూచి అని మెహిదీపట్నం శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ స్వాతి అన్నారు. శుక్రవారం పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు గణితంపై ఆసక్తికరమైన ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. అలాగే గోల్కొండ ఉర్దూ హైస్కూల్‌లో మ్యాథ్స్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల అకాడామిక్ హెడ్ సమీనాతస్వీర్ శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని వివరించారు.



గోల్కొండ ఉర్దూ హై స్కూల్‌లో..

స్నేహితుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

జియాగూడ: స్నేహితుడిపైన పగ పెంచుకుని అతడిని బండరాయితో మోది, గొంతుకోసి, చేతిని కట్‌చేసి తగలబెట్టిన నిందితుడిని అరెస్టు చేసినట్లు కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జియాగూడకు చెందిన ఇ.అనిల్‌కుమార్(35), ఇందిరానగర్‌కు చెందిన ఎల్లమయ్య వాలు గోపి (30) స్నేహితులు. తరచూ వీరు గొడవ పడుతూ కలిసేవారు. గురువారం ఉదయం ఇమాంపురా డోర్‌బస్తీ శ్మశానవాటికలో గుర్తుతెలియని మృతదేహం కాలి ఉందని సమాచారం లభించడంతో ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు విచారించారు. మద్యం సేవించిన గోపీ గురువారం రాత్రి డోర్‌బస్తీ శ్మశానవాటిక నుంచి ఇందిరానగర్ వెళ్తుండగా అటుగా వచ్చిన అనిల్‌కుమార్ ఎదురుపడగా వీరి మధ్య గొడవ జరిగింది. మద్యం సేవించి ఉన్న గోపీ అనిల్‌పై బండరాయితో దాడిచేసి గొంతుకోసి, అతని చెయ్యిన్ని కట్‌చేసి మృతిచెందిన అనిల్‌ను తగలబెట్టాడు. అనంతరం ఆ చెయ్యితో జియాగూడలో తిరిగాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించి కోర్టు రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

నేడు రంగనాథస్వామి వైకుంఠ ద్వార దర్శనం



వైకుంఠ ద్వార దర్శనం గరుడవాహన సేవా

జియాగూడ: జియాగూడ శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంలో ఈనెల 23న వైకుంఠ ద్వార దర్శనం గరుడవాహన సేవా కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు శేషాచార్యులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున 2 గంటలకు మూల విరాట్‌కు అభిషేకం, 3 గంటలకు వస్త్రాలంకరం, తోమాల సేవా, తిరుపావై సేవా కాలం, బాలభోగ నివేదనం, మంగళ శాసనం, 5 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం గరుడవాహన సేవా. 7 గంటల నుంచి భక్తులకు దర్శన సౌభాగ్యం, రాత్రి 7 గంటల నుంచి 5 రోజుల పాటు రాపత్తు ఉత్సవ ప్రారంభం, అర్ధరాత్రి 12 గంటల వరకు దర్శనం, అర్చన, తీర్థప్రసాదాలు ఉంటాయి. 27న సాయంత్రం 6 గంటలకు సేవా కాలం. నమ్మాల్వార్ పరమపదోత్సవం, రాత్రి 8 గంటలకు పల్లకీ సేవా, 9 గంటలకు హారతి, శాత్తుమురై వివిధ రకాల ప్రసాదముల గోష్టి రాపత్తు ఉత్సవ సమాప్తి. జనవరి 14న ఉదయం 8 గంటలకు శ్రీ గోదా రంగనాథస్వామి వారి అభిషేకం, రాత్రి 7 గంటలకు శ్రీ గోదా రంగనాథస్వామి కళ్యాణోత్సవం తీర్థప్రసాద గోష్టి. 16న సాయంత్రం 5 గంటలకు శ్రీ గోదా అమ్మవారి ఖరినోము ఉత్సవం. రాత్రి 10 గంటలకు ధనుర్మాస వ్రత సమాప్తి అతి వైభవంగా జరుపబడునని తెలిపారు.

పేదలను ఆదుకోవాలి



దుప్పట్లు అందజేస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్


చార్మినార్: సమాజంలోని పేదలను ఆదుకుని వారి ఆర్థికావసరాలను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని కుంభమేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం గిరిజన ప్రాంతంలో నిర్వహించిన బంజారా ధర్మ జాగరణ్ కార్యక్రమం సందర్భంగా ఆయన స్థానిక గిరిజన విద్యార్థులతో పాటు గిరిజన మహిళలకు అవసరమైన దుప్పట్లు, చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సమాజంలోని పేదలను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

'మోదీ ప్రభుత్వం నియంతృత్వంతో వ్యవహరిస్తోంది'



ధర్నాలో పాల్గొన్న వెంకటేశ్

గౌలిపురా: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నియంతృత్వంతో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. ఇండియా కూటమి పార్టీల నేతృత్వంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన భారీ ధర్నా కార్యక్రమానికి వెంకటేశ్ పాల్గొని ధర్నాకు తన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులను పట్టుకొని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..పార్లమెంటులోకి ఆగంతకులు చొరబడిన ఘటనపై ప్రశ్నించిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను ఉద్దేశ్యపూర్వకంగానే పెద్ద సంఖ్యలో సస్పెండ్ చేసిందన్నారు.



బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 విజేతలకు అభినందనలు



బాక్సింగ్ విజేతలను అభినందిస్తున్న కోచ్ హబీబ్ ముస్తఫా

చార్మినార్: శంషీర్‌గంజ్‌లోని హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థులు మహబూబాబాద్‌లో జరిగిన స్టేట్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023లో గోల్డ్ మెడల్ సాధించారు. అండర్-14 విభాగంలో 28-30 కిలోల కేటగిరిలో సయ్యద్ అహద్ హష్మీ గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే అండర్-17 విభాగంలో 70-80 కిలోల కేటగిరిలో హంజా మహమ్మద్ అహ్మద్, అండర్-19 విభాగంలో 46-49 కిలోల కేటగిరిలో అబ్దుల్ హాదీ ఓమర్, అండర్-19 విభాగంలో 70-75 కిలోల కేటగిరిలో అహ్మద్ ఖాద్రీ తదితరులు వివిధ కేటగిరిలలో గోల్డ్ మెడల్ సాధించిన విజేతలందరిని అకాడమీ కోచ్ హబీబ్ ముస్తఫా శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గోల్డ్ మెడల్ సాధించిన విజేతలందరూ ఈ నెల 24, 25, 26 తేదీలలో మహారాష్ట్రలోని అకోలాలో జరుగనున్న బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననున్నారన్నారు.

కాంగ్రెస్ మెగా ధర్నాలో గోషామహల్ నాయకులు



అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మెగా ధర్నాలో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతారావ్, నాయకులు సుభాష్ లడ్డు, నాగేష్, చిత్తు, సత్యం గౌడ్, రాధాకృష్ణ, నర్సింగ్‌రావులు గోషామహల్ నుంచి ఇందిరాపార్కు వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ రావు

డబీర్‌పురా: యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడటం సమాజానికి చాలా నష్టం కలిగిస్తుందని డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు అన్నారు. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాహీన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ రావు మాట్లాడుతూ..నేటి యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ ప్రభుత్వం'



ఇందిరాపార్కు ధర్నాకు తరలివెళ్తున్న కాంగ్రెస్ కార్వాన్ నాయకులు

గోల్కొండ: పార్లమెంట్‌లో ప్రతిపక్షాల గొంతు నొక్కడమే మోదీ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తుందని కార్వాన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. పార్లమెంట్‌లో 141 మంది ప్రతిపక్ష ఎంపీలను మూకుమ్మడిగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆయన కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంటులో విపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను నిరసిస్తూ నాయకులు కార్వాన్ నుంచి ధర్నాచౌక్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అత్యుత్తమైన భారత రాజ్యాంగ విలువలను వదిలేసి కేవలం తమ పార్టీ సిద్ధాంతాలను మాత్రమే అమలు చేయాలని చూస్తుందన్నారు. చంటిబాబు, ముంగి రఘుపాల్‌రెడ్డి, ఆకుల చంద్రశేఖర్, అబ్దుల్ హమీద్, వినోద్‌సింగ్, గిరి, జి.కిషన్, దుర్గాప్రసాద్, ఫయాజ్, భాషా, భాస్కర్ తదితరులున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కళాశాలలో క్రిస్మస్ వేడుకల సందడి

నాంపల్లి: ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమని యూతఈఎస్ఐ కార్యదర్శి జి.సుధీర్‌కుమార్‌కుమార్ అన్నారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఎఫ్ఏయూ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జి.సుధీర్‌కుమార్ క్రిస్మస్ క్యారెల్స్ వెలిగించారు. వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.సుందర్‌కుమార్, ఎస్‌పీఏ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీహెచ్.శ్రీనివాస్, సీఎఫ్ఏ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య టి.గంగాధర్ పాల్గొన్నారు.



వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

నారాయణ పాఠశాలలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంటాక్లాజ్ వేషధారణలో వచ్చి కేక్ కట్‌చేసి చిన్నారులకు బహుమతులను అందజేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలను తెలుపుతూ..గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ఐ.నవీన్‌కుమార్, ప్రిన్సిపల్ నౌషీర్ ఖాతూన్‌తో పాటు ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కౌడీ మహేందర్

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్‌లోని శివగంగానగర్ శివాలయ సమీపంలో రూ.5.20 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను శుక్రవారం బీజేపీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కౌడీ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దశాబ్దాల క్రితం అప్పటి జనాభాకనుగుణంగా వేసిన పైప్‌లైన్లు.. ప్రస్తుతం పెరిగిన జనాభాకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. అధికారులు కూడా అన్ని వర్గాల ప్రజలకు సమానత్వం పాటించి అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాపర్తి శ్రీనివాస్, విజయ్‌కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



ప్రియగిరి

అబిడ్స్: బాలిక అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కామాటిపురాలో చోటుచేసుకుంది. ఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..వేకాగిరి, హన్మంతగిరి దంపతుల కుమార్తె ప్రియగిరి (17) గురువారం ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఇంటి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకి లభించకపోవడంతో మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరునెలల క్రితం కూడా ప్రియగిరి ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి కొన్నిరోజుల తర్వాత వచ్చినట్లు ఆమె తల్లి రేఖగిరి ఫిర్యాదులో తెలిపారు. గతంలో దాదాపు నాలుగుసార్లు తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అదృశ్యమైనట్లు ఎస్ఐ.సాయికుమార్ తెలిపారు. ఆమె ఆచూకి కోసం రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, ఇతర ప్రాంతాల్లో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ సంబరాలు



సంబరాల్లో డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని, కస్తూరి వెంకట్ తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. గృహకల్పలోని యూనియన్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. అనాథ పిల్లలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. డాన్‌బాస్కో అనాథ శరణాలయానికి సంవత్సరం పాటు సరిపడే ఆహార పదార్థాలను అందజేశారు. ఈ వేడుకల్లో డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనితో పాటు బి.రేచల్, సీమా ముజీబ్, కస్తూరి వెంకట్, పర్వతాలు, శ్రీకాంత్, గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్‌బీన్ హసన్, విక్రమ్‌కుమార్, బాల్‌రాజ్, ఉమర్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, సుజాత, గీత, శ్రీధర్‌నాయుడు, మహ్మద్ వహీద్, జి.ప్రభాకర్, జానకి పాల్గొన్నారు.